

వేడుకుంటున్నా.. పట్టించుకోరా..?

జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల నిరసన



హిందూపురంలో ర్యాలీగా వస్తున్న మున్సిపల్ కార్మికులు

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు ఆయా మున్సిపాల్టీల ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం నాడు నిరసన తెలిపారు. పుట్టపర్తి, ధర్మవరం, పెనుకొండ, కదిరి, హిందూపురంలో కార్మికులు మున్సిపల్ కార్యాలయాల వద్ద బైటాయించి ధర్నా చేపట్టారు. కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, ఇంజినీరింగ్ క్లాప్ డ్రైవర్లకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, కార్మికులకు పనిముట్లు ఇవ్వాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలనే తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు.

వార్త 6లో

ఖననం కోసం 36 గంటల నిరీక్షణ..!

చనిపోతే ఆరు అడుగుల జాగా చాలు అని అంటుంటారు. కాని దళితులకు ఆ చనిపోయాక కూఅ ఆరు అడుగుల జాగా దక్కని పరిస్థితి నెలకొంది. వారికి కేటాయించిన స్మశానవాటికను కొంతమంది పెత్తందారులు ఆక్రమించుకోవడంతో అక్కడ ఖననం చేయడానికి 36 గంటలు నిరీక్షణ చేయాల్సిన వచ్చింది. అది కూడా దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఆందోళన చేపడితే అప్పుడు అధికారుల సమక్షంలో ఖననం చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి...



అధికారుల సమక్షంలో ఖననం చేస్తున్న దళితులు

- ◆ 6 అడుగుల జాగా కోసం ఆపసోపాలు
- ◆ ఆందోళన తరువాత అధికారుల సమక్షంలో అంత్యక్రియలు
- ◆ బసంపల్లిలో దళితులకు శ్మశానవాటిక సమస్య
- ◆ పెత్తందారుల కబ్జాతో స్థలం కరువు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

బసంపల్లి గ్రామానికి చెందిన మాల నరసింహులు(42) అనే వ్యక్తి శనివారం రాత్రి అకస్మాత్తుగా మృతి చెందాడు. ఈ గ్రామ పరిధిలో మృతదేహాల ఖననంకు సర్వే నంబరు 17-1బిలో 1.40 ఎకరాల శ్మశానవాటిక ఉంది. ఈ శ్మశాన వాటికను ఏడేళ్ల క్రితం గ్రామానికి చెందిన పెత్తందారులు ఆక్రమించి అక్కడ దానిమ్మ తోటను ఏర్పాటు చేశారు. తోటకు చుట్టూ కంచెను కూడా పటిష్టంగా ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ ఖననం చేయడానికి వీల్లేదని పెత్తందారులు అడ్డుపడుతున్నారు. దీంతో మృతదేహాన్ని ఎక్కడ ఖననం చేయాలో తెలియక నరసింహులు బంధువులు ఆదివారం అంతా నిరీక్షణ చేశారు. సమయం మించిపోతుండటంతో ఏమి చేయాలో పాలుపోక సమస్యను దళిత సంఘాల నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. వారితోపాటు బంధువులు అందరూ సోమవారం నాడు మృతదేహాన్ని తీసుకుని తహశీల్దార్ కార్యాలయానికి వెళ్తామని చెప్పడంతో అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. దళితులకు కేటాయించిన చోట ఖననం చేసుకునే అవకాశం కల్పిస్తామని ఆర్డీవో మహేష్, డీఎస్పీ శ్రీనివాసులు, తహశీల్దార్ సురేష్ బాబు హామీనిచ్చి అక్కడే అంత్యక్రియలు చేయించి సమస్యను తాత్కాలింగా సద్దుమణిచారు.

ఏడేళ్లుగా ఇదే సమస్య

గ్రామంలో ఏడేళ్లుగా ఈ సమస్య వెన్నాడుతుందని గ్రామానికి చెందిన దళితులు చెబుతున్నారు. అంతకు మునుపు ఒకసారి మూడు రోజుల వరకు కూడా ఖననం చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అప్పుడు అధికారులు ఈ భూమి దళిత శ్మశానవాటిక కేటాయిస్తున్నట్టు స్పష్టం చేశారు. కాని తరువాత కూడా పెత్తందారులు ఈ భూమిని ఆపకుండా కబ్జా చేసి ఏకంగా దానిమ్మతోటను పెట్టుకున్నారు.

మూడు రోజుల్లో సమాధి నేల మట్టం

శ్మశానవాటిలో ఖననం చేసినా పెత్తందారులు సమాధులను ఎప్పటికప్పుడు చదును చేసేస్తున్నారని అధికారులకు ఎస్సీ,ఎస్టీ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి వాపోయారు. రెండు నెలల క్రితం ఇదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి చనిపోతే ఇదే రకంగా ఇబ్బందులు పడి మృతదేహాన్ని ఖననం చేశామన్నారు. నాలుగు రోజులు కూడా తిరగకుండా ఆ సమాధిని నేల మట్టంచేయడంతో ఆ కుటుంబం అంత్యక్రియల తరువాత చేసే కార్యక్రమాలు కూడా జరుపుకోలేక పోయారని వాపోయారు. బసంపల్లిలో దళిత కుటుంబంలో విషాదం జరిగితే ఆ బాధ ఒక వైపు వెంటడుతుండగా, ఎక్కడ అంత్యక్రియలు చేయాలో తెలియక మనోవేదన భరించరానిదిగా ఉంటోందన్నారు. ఏడేళ్లుగా ఇదే సమస్యను దళితులు ఎదుర్కొంటు న్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దళిత కుటుంబాలకు శ్మశానవాటిక సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి.

ప్రాణాలను నిలిపే రక్తదానం : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్



రక్తదానం చేస్తున్న యువకునితో మాట్లాడుతున్న ఎస్పీ

రక్తదానం చేయడం వల్ల ఎంతోమంది ప్రాణాలు నిలబడతాయని ఆ మేరకు దాతలు ముందుకు రావాలని ఎస్పీ వి.రత్న కోరారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా సోమవారం నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఆవరణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది సాంస్కృతి కళాశాల విద్యార్థిని విద్యార్థులు, యువత, ఉపాధ్యాయులు, పాత్రికేయులు, తదితరుతు స్వచ్ఛందంగా ఇందులో పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రక్తదానానికి అందరూ ముందకు వస్తే మరొకరి ప్రాణదానం చేసిన వారు అవుతారన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం 200 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్, ఎఆర్ డీఎస్పీ విజయ్ కుమార్, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డితో పాటు పోలీసు, ఆర్డీటీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు సత్వరమే న్యాయం జరగాలి..

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా చూడాలని పోలీస్ అధికారులకు ఎస్పీ వి.రత్న ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 45 మందితో 45 అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యే విధంగా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

అధికారుల్లేని ప్రజాసమస్యల పరిష్కార వేదిక.!

ప్రజాశక్తి-హిందూపురం



ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నామమాత్రంగా హాజరైన అధికారులు

సెలక్షన్ గ్రేడ్ పురపాలక సంఘంతో పాటు 14 గ్రామపంచాయతీలతో శ్రీ సత్యసాయి జిల్లాలోని అతి పెద్ద మండలంగా హిందూపురం ఉంది. వివిధ సమస్యల పరిష్కారం కోసం వీరంతా ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వెళ్తుంటారు. ముఖ్యంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో అర్జీల ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తారు. అయితే తహశీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ఈ కార్యక్రమం తూతూమంత్రంగానే జరుగుతున్నట్లు కన్పిస్తోంది. తహశీల్దార్ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌కు రెవెన్యూ అధికారులతో పాటు, మండల పరిషత్, వ్యవసాయ శాఖ, గహ నిర్మాణ శాఖ, ఐసిడిఎస్, ఉద్యానవన, విద్యా, రోడ్డు భవనాలు, ఎపిఎస్ఆర్‌టిసి తదితర శాఖల అధికారులు పాల్గొనాల్సి ఉంది. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో రెవెన్యూ, ఐసిడిఎస్, గృహ నిర్మాణ, వ్యవసాయ శాఖ, వెలుగు శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు హాజరయ్యే విధంగా చూడాల్సిన రెవిన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చాలా శాకల అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావడం లేదన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. గత వారం కురిసిన వర్షాలకు పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రోడ్లు అన్నీ గుంతలమయంగా మారాయి. వీటిపై వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి చర్యలు తీసుకుని రోడ్లను మరమ్మతు చేయించాల్సిన రోడ్డు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఒక్క వారం సైతం మీకోసం కార్యక్రమానికి హాజరు కావడం లేదు. ఇక ఎపిఎస్ఆర్టిసి అధికారులు ఈ కార్యక్రమానికి రావడమే మానేశారు. సిరికల్చర్, హార్టికల్చర్ అధికారులు వారికి తీరిక దొరికినప్పుడు మాత్రమే అలా వచ్చి ఇలా సంతకం జారుకుంటున్నారు. మిగిలిన శాఖ అధికారులు సైతం నామమాత్రంగానే హాజరువుతున్నారు. ఈ విషయంపై తహశీల్దార్ వెంకటేశును వివరణ కోరగా ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి హాజరుకాని అధికారుల వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి, వారు సూచించిన విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.



రోడ్ కమ్ చెక్ డ్యామ్‌ను పరిశీలిస్తున్న స్పానిష్ బంద సభ్యులు

చెక్‌డ్యామ్‌ను పరిశీలించిన స్పానిష్ బృందం

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండల పరిధిలోని అప్పరాచెరువు గ్రామ సమీపంలోని సంఘమేశ్వర క్షేత్రం వద్ద ప్రవహిస్తున్న చిత్రావతి నదిపై ఆర్డీటీ సహకారంతో నిర్మించిన రోడ్డు, చెక్‌డ్యామ్‌ను స్పానిష్ బందం సభ్యులు సోమవారం పరిశీలించారు. సంఘమేశ్వర క్షేత్రం వద్ద చిత్రావతి నదిపై రూ.1.86 కోట్లతో నిర్మించిన ఈ చెక్‌డ్యామ్‌ను వైసిపి మాజీ మండల కన్వీనర్ భగ్గిరి భయపరెడ్డితో కలిసి స్పానిష్ బందం సభ్యులు డివిగో, అలెక్స్, వురియల్, బేగోత, డైరెక్టర్ భీమలింగప్ప తదితరులు పరిశీలించారు. ఆర్డీటీ సహకారంతో రోడ్డు, చెక్‌డ్యామ్ నిర్మాణం పూర్తి కావడంతో చిత్రావతి నది పరివాహక ప్రాంతాల్లోని ఎనిమిది గ్రామాల ప్రజల రాకపోకలకు ఉపయోగపడుతోంది. నీటి నిల్వతో భూగర్భజలాలు భారీగా పెరిగే అవకాశం ఉందని వైసిపి మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి వివరించారు. స్పానిష్ బందం వెంట వైసిపి మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, ఈశ్వరయ్య, లింగమయ్య, నారాయణస్వామి ఉన్నారు.

పారదర్శకంగా నైపుణ్య గణన

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా అభివద్ధిలో నైపుణ్య గణన గణాంకాలు ప్రముఖ పాత్ర పోషిస్తుందని, ఈ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక డిఆర్‌డిఎ కార్యాలయం సమావేశ మందిరంలో ఏపీ నైపుణ్య అభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన నైపుణ్య గణన-2024 జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు గణనీయంగా పరివర్తన చెందుతాయాన్నరు. భవిష్యత్తులో వచ్చే మార్పులకు అనుగుణంగా యువత వారి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఉద్యోగాలు పొందడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న నైపుణ్య గణనను (స్కిల్ సెన్సస్)ను సచివాలయ సిబ్బంది పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ప్రస్తుతం జిల్లా స్థాయిలో శిక్షణ తీసుకున్న వారు మండల, మున్సిపల్ స్థాయిలో సచివాలయ సిబ్బంది, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, జిల్లా నైపుణ్య అభివద్ధి సంస్థ హరీష్, జిఎస్ డబ్ల్యూఎస్ నోడల్ ఆఫీసర్, సుదర్శన్ రెడ్డి, మాస్టర్ ట్రైనర్ అశోక్ పాల్గొన్నారు.

రక్తదానంపై అపోహలు వద్దు : డీఎస్పీ

ప్రజాశక్తి-హిందూపురం

రక్తదానంపై ఎటువంటి అపోహలు పెట్టుకోకుండా ప్రాణాపాయంలో ఉన్న వారికి రక్తదానం చేసి కాపాడాలని డీఎస్పీ మహేష్ తెలిపారు. పోలీసుల అమరవీరుల వారోత్సవాలను పురష్కరించకుని సోమవారం నాడు జిల్లా ప్రభుత్వ అసుపత్రి రక్తనిధి కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం 60వ సారి రక్తదానం చేసిన ఉమర్ ఫారూక్ ఖాన్‌ను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఐ రాజగోపాల్ నాయుడు, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, చోటు, ముజ్జుతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానానికి సహకారం అభినందనీయం

హిందూపురం : సద్గురు యోగి నారాయణ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదానానికి దాతలు సహకరించడం అభినందనీయమని సేవాసమితి నిర్వాహకులు రవిశంకర్ పేర్కొన్నారు. సోమవారం 103వ రోజు 330 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సోమందేపల్లికి చెందిన రామదాసు సోదరుడి కుమార్తె వివాహం సందర్భంగా అన్నదాన కార్యక్రమానికి వితరణ ఇచ్చారని సేవా సమితి నిర్వాహకులు రవిశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రామదాసు కుటుంబ సభ్యులు, గొల్లన్న పాల్గొన్నారు.

హెచ్‌ఐవి రహిత జిల్లాగా మారుద్దాం

పుట్టపర్తి రూరల్ : జిల్లా వ్యాప్తంగా హెచ్‌ఐవి, ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని డిఎం హెచ్ఒ డా.మంజువాణి ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పిఎంపిఎస్ఈపై కమ్యూనిటీ అడ్వైజరీ బోర్డు సమావేశం నిర్వహిం చారు. డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ఏ ఒక్కరూ హెచ్‌ఐవి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకునేలా స్వచ్ఛంద సంస్థలు అవగాహన, నియంత్రణ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో క్లస్టర్ ప్రోగ్రాం అధికారి భాస్కర్, డాక్టర్ గాయత్రి, ఎఆర్‌టి సెంటర్, ఐసిటిసి ప్రివెన్షన్ యూనిట్స్ మేనేజర్స్, కమ్యూనిటీ మెంబర్స్, చైల్డ్ ఫండ్ ఇండియా నెట్‌వర్క్ కమిటీ సభ్యులు, పియు పిఎమ్స్ ఆంజనేయులు, ఎంఈ అశోక్, తిప్పేస్వామి, నవీన్, శ్రీనివాసులు, డిఆర్పి రమేష్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు

ప్రజాశక్తి-హిందూపురం



హిందూపురంలో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

డిగ్రీ, ఇంజినీరింగ్, బి-ఫార్మసీ తదితర విద్యకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ కార్యలయం ముందు విద్యార్థులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గత సంవత్సరం నుంచి ఇవ్వాల్సిన స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ దాదాపుగా రూ.3480 కోట్ల వరకు పెండింగ్‌లో ఉందని అన్నారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీ మేరకు వీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆయా కళాశాలల్లో ఫీజుల కోసం యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అందించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వసతి గృహ విద్యార్థులకు ఇస్తున్న కాస్మోటిక్, మెస్ చార్జీలను రూ. 3వేలకు పెంచాలన్నారు. జీఓ నెంబర్ 77ను రద్దు చేసి పీజీ చదివే ప్రతి విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపజేయాలన్నారు. విద్యార్థుల సమస్యలు కోరుతూ నవంబర్ 6వ తేదీన వేలాది మంది విద్యార్థులతో చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు తరుణ్, పవన్, హాసేన్, హుస్సేన్, ఆఫ్రిద్, మూర్తి, అనుదీప్, మంజునాథ్, రంగనాథ్, భూతరాజు, సంతోష్, రఘు, కిరణ్, సురేష్, సుదర్శన్, తిప్పేస్వామి, వినయ్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హర్షకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి ఆర్డీవో టి.ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. హర్షకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ప్రారంభించాలని, ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను రూ. 3 వేలకు పెంచాలని, డిగ్రీ, ఇంజినీరింగ్, బి-ఫార్మసీ, తదితర ఉన్నత విద్యలో పెండింగ్ ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని కోరారు. జీవో 77ను రద్దు చేసి పీజీ చదివే ప్రతి విద్యార్థి కి ఫీజు రీయింబర్స్‌మెంట్, అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం వర్తింపజే యాల న్నారు. లేనిచో నవంబర్ 6వ తేదీ చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తా మని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు భగత్, ముని, విద్యాసాగర్, హరి, చైతన్య, పాల్గొన్నారు.

కొత్తచెరువు : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున, ఉపాధ్యక్షులు పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, అమ్మఒడి ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం స్పందించక పోతే నవంబర్ 6వ తేదీ చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చి ధర్నా చేస్తామన్నారు. అలాగే జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ప్రారంభించాలని, బిసి బాలికల వసతిగహంలో కనీస సౌకర్యాలు కల్పించాలని డిప్యూటీ తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు.

మడకశిర : పట్టణంలోని బాలికల ప్రభుత్వ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని, ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని, విద్యాసంస్థల వేళలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రజాదర్బార్' అర్జీలను త్వరగా పరిష్కరిస్తాం : మంత్రి

ప్రజాశక్తి-గోరంట్ల



సోమందేపల్లి చెరువును పరిశీలిస్తున్న మంత్రి సవిత

ప్రజాదర్బార్‌లో అందిన ప్రతి అర్జీని జవాబుదారీతనంతో త్వరగా పరిష్కరిస్తామని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మంత్రి సవిత పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మంత్రి మాట్లాడుతూ అధికారులు పార్టీలకు అతీతంగా ప్రజల కోసం పని చేయాలన్నారు. గత ప్రభుత్వంలో వైసిపి నాయ కుల భూ కబ్జాలు, అక్రమాలకు కొందరు అధికారులు సహకరించ డం వల్ల సామాన్యులకు అన్యాయం జరిగిందన్నారు. అలాంటి బాధితుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అర్హులందరికీ పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్లు అందిస్తామన్నారు. అధిక శాతం భూ సమస్యలు, రహదారులు, డ్రెయినేజీపై అర్జీలు అందాయి. కరవపల్లిలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని మండల మాజీ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి కోరారు. ప్రభుత్వ భూమిని కబ్జాపై జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సురేష్ ఫిర్యాదు చేశారు. రైతులు భూమికి సంబంధించి ఆన్‌లైన్ సమస్యలపై వినతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిఐ శేఖర్, తహశీల్దార్ మారుతి, ఎంపిడిఒ నరేంద్రకుమార్, సర్పంచి నరసింహ మూర్తి వివిధ శాఖల అధికారులు, టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్, బాలకృష్ణచౌదరి, నరేష్, ఉత్తమరెడ్డి, పచ్చ అశోక్, సుబ్బారెడ్డి, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

నాసిన్, బెల్ భూ నిర్వాసితులకు ఆర్అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని కోరుతూ వ్యకాసం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యురాలు స్వర్ణలత, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేష్ ఆధ్వర్యంలో రైతులు మంత్రి సవితకు వినతిపత్రం అంద జేశారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ భూ నిర్వాసితులకు ఒక్కొక్కరికి ఒకరకంగా పరిహారం చెల్లించ డం తగదన్నారు. దళిత రైతులకు ఎకరాకు కేవలం రూ. 2.45 లక్షలు మాత్రమే ఇచ్చి ద్రోహం చేశార న్నారు. జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు మాట్లాడుతూ ఎముకలగుట్టపల్లి జగనన్న కాలనీ వద్ద ఉన్న డంపింగ్ యార్డ్‌ను తొలగించాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో భూ నిర్వాసితులు అచ్చమ్మ, అమీజమ్మ, వెంకటరామిరెడ్డి, నారాయణ, తదితరులు ఉన్నారు.

మంత్రి దృష్టికి రెడ్డిచెరువుపల్లి సమస్యలు

గోరంట్ల రూరల్ : మూడు నెలలుగా రెడ్డి చెరువు పల్లి పంచాయతీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఉపసర్పంచి బోయ నరసింహప్ప, గ్రామస్తులు మంత్రి సవితకు విన్నవించుకున్నారు. ప్రజల సమస్యలను సర్పంచి వినోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని తెలిపారు. స్పందించిన మంత్రి పంచాయతీ సమస్యలను సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

జగన్ ప్రభుత్వ తప్పిదాల వల్లే రైతులకు ఇబ్బందులు

సోమందేపల్లి : వైసిపి ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్లే నేడు రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి సవిత తెలిపారు. మండలంలోని హంద్రీనీవా కాలువతో పాటు చెరువు కింద సాగు చేసిన పంట పొలాలను మంత్రి పరిశీలించారు. తమ పంట పొలాలకు నీరందక నష్టపోతున్నామని కొందరు రైతులు మొరపెట్టుకోగా నీరందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట ఇరిగేషన్ డిఈ లక్ష్మీనారాయణ, ఏఈ సిఎం.రమేష్, టిడిపి మండల కన్వీనర్ సిద్ధిలింగప్ప, నాయకులు వెంకటరమణ, నీరగంటి చంద్ర, డివి ఆంజనేయులు, వెంకటేష్, టౌన్ కన్వీనర్ వడ్డీ సురేష్, హరికృష్ణ, కిష్టప్ప, అంజి, శ్రీరాములు, అన్సర్, తదితరులు ఉన్నారు.

నూతన బస్సులు ప్రారంభించిన మంత్రి

పెనుకొండ : పెనుకొండ ఆర్టీసీ డిపో పరిధిలో మంత్రి సవిత 2 నూతన బస్సులను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ పెనుకొండ డిపో అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తిరుపతి, కర్నూలు సర్వీసుల స్థానంలో ఈ బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. మరిన్ని నూతన సర్వీసులు ఏర్పాటు చేసేందుకు సంబంధిత శాఖ మంత్రితో చర్చిస్తామని తెలిపారు. ప్రజల వినతి మేరకు పెనుకొండ నుంచి హైదరాబాద్, విజయవాడ, శ్రీశైలం, తదితర ప్రాంతాలకు ప్రభుత్వం త్వరలోనే నూతన బస్సులు మంజూరు చేస్తుందన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు పట్టణ కన్వీనర్ పైపల్లి గంగాధర్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు. గంగాధర్ మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజేషన్, ఇంజినీరింగ్ క్లాప్ డ్రైవర్లకు జీవో-36 మేరకు వేతనాలు, కార్మికులకు పనిముట్లు, కారుణ్య నియామకాలు, విజయవాడ వరద సహాయక చర్యల్లో పాల్గొన్న కార్మికులకు దుస్తులు, కూలి డబ్బులు, తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంత రం మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ ఏఈ స్వాతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగరాజు, నాగార్జున, గోవింద్, దొడ్డప్ప, రమణ, సద్దాం, సాయినాథ్, వెంకటరాముడు, నారాయణమ్మ, పెద్దక్క, సుధాకర్, రమేష్ పాల్గొన్నారు.

హిందూపురం : పట్టణంలో పారిశుధ్య కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి, కమిషనర్ ఛాంబర్ ముందు ఆందోళన చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి.శ్రీనివాసులు, మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సేవలను ప్రశంసిస్తూ, కార్మికులకు పాద పూజా చేయల్సిన అవసరం లేదని వారికి కనీస వేతన చట్టాన్ని అమలు చేసి వేతనాలు ఇస్తే చాలన్నారు. కనీస వేతనాలు, ఎన్ఎంఆర్, కోవిడ్, బదిలీ, క్లాప్ డ్రైవర్లకు చట్టబద్ధమైన వారాంతపు క్యాజువల్ జాతీయ సెలవులు, యూనిఫాం, పనిముట్లు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు విఆర్.రాము, మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, కోశాధికారి బాబయ్య, రామచంద్ర, గుర్నాథ్, చంద్ర, హనుమంతు, మహిళా నాయకురాలు కవితమ్మ, ఓబులమ్మ, మహేశ్వరమ్మ, సుబ్బలమ్మ పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు కమిషనర్ కిరణ్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. మున్సిపల్ కార్మికులను డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జనార్ధన, బాలకృష్ణ, తిరుపాలు, నరసింహమూర్తి, చిన్న కృష్ణ, శ్రీనివాసులు, రాజేష్, రామాంజులు, చంద్రప్ప, సిఐటియు నాయకులు జిఎల్.నరసింహులు, జగన్మోహన్, ముస్తాక్‌లి, బాబ్‌జాన్, ఫాజిల్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు

సిఐటియు ఆధ్వర్యంలో ధర్నాలు.. అధికారులకు వినతులు



మున్సిపల్ ఏఈ స్వాతికి వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

పెనుకొండ టౌన్ : దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో నగర పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి మేనేజర్ నాగరాజుకి వినిత పత్రం సమర్పించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి, సిఐటియు మండల కన్వీనర్ బాబావలి మాట్లాడుతూ పట్టణ జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, సమ్మె కాలపు వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పండుగ కానుక ఇవ్వాలని, ఈఎస్ఐలో లోపాలను సరి చేయాలని, పనిముట్లు, యూనిఫామ్ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చిన్న వెంకటేష్, ఈ.వెంకటేష్, నరసింహులు, లక్ష్మీదేవి, నరసమ్మ, చంద్ర, వ్యకాసం నాయకులు గంగాధర్ పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలిపి మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. సిఐటియు నాయకులు జెవి.రమణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి తగదన్నారు. పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు సుప్రీం కోర్టు తీర్పు మేరకు వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పారిశుధ్య కార్మికులకు పనిముట్లు, క్లాప్ డ్రైవర్లు, కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాల న్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కో కన్వీనర్ అయూబ్‌ఖాన్, ఇంజినీరింగ్ కార్మికులు, సంఘం నాయకులు బొగ్గు నాగరాజు, అనిల్, యోగేష్, బాబు, పారిశుధ్య కార్మికుల సంఘం నాయకులు బాబు, ముకుంద, ఓబులేసు, వెంకట, కార్మికులు పాల్గొన్నారు.

పుట్టపర్తిని సుందరంగా తీర్చిదిద్దుదాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ప్రశాంతి నిలయంగా పేరుగాంచిన పుట్టపర్తి పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద, అధికారులతో కలిసి పట్టణంలో పర్యటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నవంబర్‌లో జరిగే సత్యసాయి బాబా జయంతి వేడుకలకు దేశ, విదేశాల నుంచి భక్తులు వస్తారని వారికి అన్ని వసతులు కల్పించాలన్నారు. పట్టణం మొత్తం పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. చిత్రావతిలోకి వస్తున్న వరద, డ్రెయినేజీ నీటిని పరిశీలించారు. నది ఒడ్డున టైల్స్ పగిలిపోయి ఉండడం గమనించి కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. పరిసరాల్లో చెత్త చెదారం, పిచ్చి మొక్కలు తొలగించి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చిత్రావతి పరివాహక ప్రాంతాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి పట్టణ వాసులకు సాయంత్రం వేళ ఆహ్లాదకర వాతావరణం కల్పించాలన్నారు.

ట్రాఫిక్ సమస్యను నియంత్రించాలి

నవంబర్‌లో సత్యసాయిబాబా జయంతి వేడుకల సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సింధూర రెడ్డి పోలీసులకు సూచించారు. బాబా మందిరం వెళ్లే దారిలోని గణేష్‌గేట్, ప్రశాంతి నిలయం గేట్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో కొందరు ఆటోలు, ప్రయివేటు వాహనాలు అడ్డు పెట్టి మహిళా భక్తులకు అసౌకర్యం కలిగిస్తున్నారని వాటిని అరికట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, బేకరీ నాయుడు, చెర్లోపల్లి దేవారెడ్డి, కౌన్సిలర్లు ఉన్నారు.

శిక్షణ కేంద్రం ప్రారంభం

వృత్తి విద్యలో నైపుణ్యం పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మహిళలకు సూచిం చారు. పట్టణంలోని ఎస్‌బిఐ రోడ్డులో ఏర్పాటు చేసిన పిఎం విశ్వకర్మ యోజన శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. మహిళలు వృత్తి విద్యలో నైపుణ్యం పెంపొందించుకొని జీవనోపాధిని మెరుగుపరచుకుని కుటుంబాలను పోషించుకోవాలన్నారు. బ్యూటిఫికేషన్, పూలదండలు, పూలబొకే తయారీలో వారం రోజుల పాటు శిక్షణ ఇవ్వడంతో పాటు రోజుకు రూ. 500 ఇస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణరెడ్డి, సామకోటి ఆదినారాయణ, దేవా, శిక్షణ కేంద్రం నిర్వాహకురాలు గాయత్రి, విజయ్‌కుమార్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతాయుతంగా పని చేయాలి

సమయపాలన పాటిస్తూ ప్రజల సమస్యలను నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని కర్ణాటక నాగేపల్లి 1, 2 వార్డుల సచివాలయాలను సోమవారం ఎమ్మెల్యే సందర్శించారు. ఉద్యోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొందరు ఉద్యోగులు గైర్హాజరు కావడంతో రిజిస్టర్‌లో వారికి సెలవు నమోదు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల కోసం ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. సమస్యలతో సచివాలయానికి వచ్చిన వారిని గౌరవించి కూర్చోపెట్టి పని చేసి పెట్టాలని సూచించారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో చాలా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని సూచించారు. ఎమ్మెల్యేతో పాటు కమిషనర్ ప్రహ్లాద, నరసింహులు, సిబ్బంది, నాయకులు సామకోటి ఆదినారాయణ, బేకరీ నాయుడు, దేవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



చిత్రావతి నది పరివాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి

ప్రజల సమస్యలు పరిష్కరించండి : ఎమ్మెల్యే

కొత్తచెరువు : ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలన్నారు. సంక్షేమ పథకాల మంజూరులో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఎవరైనా లంచం తీసుకుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కొత్తచెరువు బిసి వసతి గృహం శిథిలావస్థకు చేరుకుందని తెలుపగా ఎమ్మెల్యే వెంటనే ఫోన్ ద్వారా అధికారులతో మాట్లాడి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ నీలకంఠారెడ్డి ఎంపిడిఒ నటరాజు, ఏవో నటరాజు, ఏపిఒ నాగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, నాయకులు కిరణ్, వెంకటేష్, పెద్దన్న, గోపాల్, కార్యదర్శులు పాల్గొన్నారు.

టిడిపి నేత మృతికి ఎమ్మెల్యే నివాళి

మండలంలోని కేసాపురం గ్రామపంచాయతీలోని వెంకటాపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు లెక్కల చెన్నప్ప అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆ గ్రామం వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, నాయకులు వెంకటేశు, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, శివ ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి తెలిపారు. రొళ్ల మండల తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ వైఫల్యాల కారణంగానే ప్రజల నుంచి పెద్దఎత్తున వినతులు వస్తున్నాయన్నారు. అందులో ప్రధానంగా పింఛన్లు, కొత్త ఇళ్లు, ఇళ్ల బిల్లులు, తాగు, సాగునీరు, వన్-బి, అడంగల్, ఈ పాసు పుస్తకం, తదితర సమస్యలకు సంబంధించి వినతులు అందాయన్నారు. అర్జీలను పరిశీలించి దశల వారీగా పరిష్కరిస్తామని కార్యక్రమంలో తహశీల్దార్ భాగ్యలక్ష్మి, ఎంపిడిఒ ప్రసాద్, మండల కన్వీనర్ దాసిరెడ్డి, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి బిఎస్.గురుమూర్తి, జిల్లా కార్యదర్శి రవిభూషణ్, నాయకులు విఎం.పాండురంగప్ప, సన్న తిమ్మప్ప, జికె.ఈరన్న, రామకృష్ణ, భరత్, సిద్ధగంగప్ప, రవికుమార్, శ్రీరంగప్ప, కృష్ణప్ప, జిఎస్.యోగానంద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంతో రైతుల అభివృద్ధి

పండ్ల తోటల పెంపకంతో రైతుల అభివృద్ధి సాధించవచ్చని ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. వారు పట్టణంలోని రైతులకు పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పండ్ల తోటలు పెంచి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. వారి వెంట ఎపిడి లక్ష్మీనారాయణ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే

పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని యాదవ కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని రక్తదాతలకు పండ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల కోసం ఎంతోమంది పోలీసులు ప్రాణాలర్పించారన్నారు. వారి త్యాగాలను మనం స్మరించుకోవాలన్నారు. తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సిఐ రామారావు, రూరల్ సిఐ రాజకుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి నాయకుల మృతికి ఎమ్మెల్యే సంతాపం



ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రాజు, గుండుమల తిప్పేస్వామి

మడకశిర పట్టణానికి చెందిన టిడిపి బూత్ ఇన్‌ఛార్జి నంజుండ అనారోగ్యంతో మృతి చెందాడు. అలాగే టిడిని నాయకుడు అంజనప్ప, మండలంలోని హెచ్‌ఆర్ పాళ్యం గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే రాజు, గుండుమల తిప్పేస్వామి మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మృతుల కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట కౌన్సిలర్ ఉమాశంకర్, నాయకులు తిమ్మరాజు, నాగరాజు, వెంకటాద్రి ఉన్నారు.

ప్రమాద బాధితులను ఆసుపత్రికి తరలించిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే రాజు కారులో అనంతపురం నుంచి మడకశిర వైపు వస్తుండగా పెనుకొండ వెళ్లే ప్రధాన రహదారిలో ఇసుక ట్రాక్టర్ బోల్తా పడింది. స్పందించిన ఎమ్మెల్యే ప్రమాద స్థలానికి వెళ్లి తీవ్రంగా గాయపడిన రొద్దం మండలంలోని గద్దెపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ నాగరాజు, విజయ్‌కుమార్, దేవరాజులను ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వాల్మీకి జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే

గుడిబండ : మండలంలోని పూజారిపల్లి గ్రామంలో వాల్మీకి సామాజిక వర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్మీకి జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, దాసిరెడ్డి, పాండురంగప్ప, నాయకులు లక్ష్మీనరసప్ప, ఈరన్న పాల్గొన్నారు.

లైసెన్స్‌దారులే బాణసంచా విక్రయించాలి : ఆర్డీవో

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

దీపావళి సందర్భంగా లైసెన్స్ కలిగిన వారు నియమ నిబంధనల ప్రకారం బాణసంచా విక్రయించాలని ఆర్డీవో మహేష్ తెలిపారు. పట్టణంలోని ఆర్డీవో సమావేశ భవనంలో సోమవారం అనుమతి పొందిన టపాసుల విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్డీవోతో పాటు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, తహశీల్దార్ నటరాజ్, ఫైర్ ఆఫీసర్ రాజు, సిఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప, శ్యామ్ రావు పాల్గొన్నారు. బాణసంచా విక్రయాలకు సంబంధించి పలు సూచనలు చేశారు. అవాంఛనీయ సంఘటనలు, అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటిరాలన్నారు. డివిజన్ పరిధిలోని ఐదు మండలాలలో 20 మంది మాత్రమే బాణసంచా విక్రయాలకు అనుమతి పొందారని తెలిపారు. సమావేశంలో డిఎఒ కుఫ్రా, తహశీల్దార్లు స్వర్ణలత, నారాయణస్వామి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

'మా భూమి మాకు ఇప్పించండి '

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

వారసత్వంగా పెద్దల నుంచి సంక్రమించిన మా భూమిని మాకు ఇప్పించాలని కోరుతూ గోరంట్ల మండలంలోని పాలసముద్రం గ్రామానికి చెందిన వలిసాబ్, పాపూసాబ్ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ టిఎస్.చేతన్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పాలసముద్రం రెవెన్యూ పొలంలో తమకు 9.67 ఎకరాల భూమి ఉందన్నారు. కుటుంబంలో పెద్దవాడైన దస్తగిరిసాబ్ అక్రమంగా పట్టాదారు పాసుపుస్తకరం పొంది అందులో కొంత భూమిని ఇతరులకు విక్రయించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయంపై పెనుకొండ కోర్టులో కేసు వేశామన్నారు. భూమి విషయం కోర్టులో ఉండగానే దస్తగిరి కొడుకులు హారుణ్‌బాషా, రషీద్ మిగిలిన భూమిని అమ్మడానికి ప్రయత్నిస్తున్నారని, భూమి క్రయవిక్రయాలను నిలుపుదల చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. వారు కలెక్టరేట్ గేటు ముందు కొద్దిసేపు నిరసన తెలిపారు. వారి వెంట మహబూబ్‌జాన్, పర్విన్‌తాజ్, షేక్షావలి, ఆసియా, ముంతాజ్, షామీర్, మున్నా, హసీన, తదితరులు ఉన్నారు.



తనకల్లు తహశీల్దార్ కార్యాలయంలో బేల్దారి పని చేస్తున్న విఆర్ఎ

తాపీ మేస్త్రీ కాదు.. విఆర్ఎ..!

ప్రజాశక్తి-తనకల్లు

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఉన్నతాధికారులు విఆర్ఎల చేత కార్యాలయ మరమ్మతులు చేయించడం విమర్శలకు దారి తీసింది. వివరాలు.. మండలంలోని వివిధ గ్రామాల విఆర్ఎలు తహశీల్దార్ కార్యాలయంలో పెచ్చులూడి దెబ్బతిన్న గోడలు, మెట్లు, ఇతరత్రా పనులు చేయడం కనిపించింది. విఆర్ఎలు తాపీ పనులు చేయడం చూసిన ప్రజలు ఉద్యోగుల చేత ఇలాంటి పని చేయించడం ఏంటని పెదవి విరిచారు.

సేవామందిర్‌లో అంతర్జాతీయ బాలికా దినోత్సవం

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని సేవామందిర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సోమవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ, మానవహారం కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ఆర్డీటీ అనంతపురం నుండి డైరెక్టర్ పుష్పలత, రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సమాజంలో బాలికలపై దాడులను ఖండించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1098 టోల్ ఫ్రీ నెంబర్ ఉద్దేశాన్ని ప్రతి ఒక్కరు గ్రహించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా టీమ్ లీడర్ రఘురామ్, బాలికలు వారి తల్లిదండ్రులు, టీచర్లు పాల్గొన్నారు.



కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్డీటీ అధికారి

నేరాలు ఘోరాలు

నర్సరీ నిర్వాహకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ముదిగుబ్బలో సోమవారం నర్సరీ నిర్వాహకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. కడప జిల్లాలోని వేంపల్లె గ్రామానికి చెందిన నరసింహుడు (35) పదేళ్ల క్రితం ముదిగుబ్బకు వలస వచ్చాడు. స్థానిక అనంతపురం రోడ్డులో నర్సరీ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తుండేవాడు. గతేడాది నర్సరీ లో రూ. 4 లక్షలు నష్టం వచ్చిందని, ఈ ఏడాది రూ. 4 లక్షలతో విత్తనాలు తెచ్చి పైరు సాగు చేశాడు. ఇటీవల కురిసిన వర్షాలకు నర్సరీలో ఉన్న మొక్కలు అమ్ముడుపోక నష్టం వాటిల్లిందని తరచూ భార్య వద్ద ఆవేదన వ్యక్తం చేసేవాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య సుధ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నరసింహుడు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

పొరపాటున ద్రావకం తాగి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని బిటి పల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు రంగధామప్ప(68) నీళ్లు అనుకొని పొరపాటున మల్బరీ షెడ్డును శుభ్రం చేసేందుకు ఉపయోగించే ఫార్మాలిన్ తాగి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, ఎస్ఐ మునిప్రతాప్ తెలిపిన వివరాలు.. రంగధామప్ప సోమవారం ఉదయం తన మల్బరీ షెడ్డును శుభ్రం చేస్తుండగా దాహం వేసింది. దీంతో మల్బరీ షెడ్‌ను శుభ్రం చేయడానికి ఉపయోగించే నీళ్ల లాంటి ఫార్మాలిన్ మందును తాగడంతో పొట్టలో తీవ్రమైన మంట రావడంతో పాటు కళ్లు తిరుగుతున్నాయని కుటుంబ సభ్యులకు చెప్పాడు. దీంతో వారు అతడిని గుడిబండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు పరిక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఇతనికి ఇద్దరు కుమారులు,ఓ కుమార్తె ఉన్నా వారంతా బెంగుళూరులో ఉన్నారు. రంగధామప్ప భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమతి లేకుండా వెంచర్లు వేయొద్దు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

అనుమతి లేకుండా వెంచర్లు వేయకూడదని ఈవోఆర్డీ మాధవరెడ్డి సూచించారు. స్థానిక గంగ మ్మ గుడి వద్ద తహశీల్దార్ కార్యాలయం పక్కన వ్యవసాయ భూమిని వాణిజ్య భూమిగా మార్చి వెంచర్లు ఏర్పాటు చేస్తుండగా సోమవారం ఈవోఆర్డీ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. నియమ నిబంధనలు పాటించి అనుమతులు తీసుకొని వెంచర్లు వేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ముబారక్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో వికలాంగుల స్క్రీనింగ్ క్యాంప్

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ప్రశాంతి నిలయంలో సోమవారం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీసత్యసాయి దివ్యాంగజన సేవ మొదటి స్క్రీనింగ్ క్యాంప్‌ను ప్రారంభించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్, సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ల ద్వారా అన్ని వయసుల వారికి నాణ్యమైన కృత్రిమ సహాయక పరికరాలను ఉచితంగా అందిస్తామన్నారు. ఈ సేవను పొందేందుకు ఆండ్రాయిడ్ యాప్‌లో శ్రీసత్యసాయి దివ్యాంగజన్ సేవ పేరుతో నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సత్య సాయి ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఎల్ఐసి ఏజెంట్లే దేశ ఆర్థిక మూలస్తంభాలు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

దేశ ఆర్థిక మూలధనం పెరగడానికి ఎల్ఐసి ఏజెంట్లే కారణమని కదిరి ఎల్ఐసి ఏజెంట్ల యూనియన్ నాయకులు తెలిపారు. పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయం వద్ద సోమవారం గేట్ సమావేశం నిర్వహించి ధర్నా చేపట్టారు. ఎల్ఐసి ఏజెంట్లకు కమీషన్ తగ్గించడం తగదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలతో కుమ్మక్కైన విధానాన్ని మానుకోవాలన్నారు. కమీషన్ పెంచి ఎల్ఐసి ఏజెంట్ల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ధర్నాలో ఎల్ఐసి యూనియన్ నాయకులు మురళీధర్, లోకేశ్వర్‌రెడ్డి, కోటేశ్వరరావు, శ్రీరాములు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

రొద్దం : మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన దళిత నరసింహులు భార్య క్యాన్సర్‌తో బాధపడుతూ కొన్నిరోజుల క్రితం కర్నాటకలోని పావగడ సమీపంలో ఉన్న నాన్నగానిపల్లి గ్రామంలో మృతి చెందింది. దీనికి తోడు నరసింహులు కాలు విరిగింది. దీంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి కుటుంబానికి సోమవారం దళిత సామాజిక వర్గం ఉపాధ్యాయులు రూ. 27 వేలు అందజేశారు. ఉపాధ్యాయుడు వెంకటేష్ తోటి ఉపాధ్యాయులు 39మందితో కలిసి రూ. 27వేలు పోగుచేసి అందజేశారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో నీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలకు నీటి సౌకర్యం లేక అధికారులు ఇబ్బందులు పడుతున్న విషయం ఎంపిపి గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ దృష్టికి వెళ్లింది. స్పందించిన ఆయన బోరు వేయించి పైపులైన్ ద్వారా ఎంపిడిఒ, తహశీల్దార్, హౌసింగ్, పశు వైద్యశాల, ప్రభుత్వాసుపత్రి, తదితర ప్రభుత్వ కార్యాలయాలకు నీటి సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ విజయ్‌భాస్కర్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఈ ప్రసాద్, పొడగళ్లపల్లి సర్పంచి నాగభూషణ, అంజన్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతే పోలీసుల కర్తవ్యం : ఎస్ఐ

ప్రజాశక్తి-అమడగూరు

ప్రజలకు భద్రత కల్పించడం, రక్షించడంతో పాటు ప్రాణాలను నిలబెట్టడం తమ కర్తవ్యమని ఎస్ఐ వెంకటనారాయణ తెలిపారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సోమవారం మండలంలోని 25మంది యువకులు రక్తదానం చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం అందరి బాధ్యత అన్నారు.

30న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ధర్మవరంరూరల్ : పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ప్రమోద్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో అజెండాలోని 44 అంశాలపై చర్చించి తీర్మానం చేస్తామన్నారు. అలాగే పట్టణంలోని 40 వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తారని, కౌన్సిలర్లు సకాలంలో హాజరుకావాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ధర్మవరం రూరల్ : మండలంలోని రావులచెరువు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ జానకి రామయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ సరఫరా నిలిపివేస్తున్నామని, రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు రక్తదాన శిబిరం

కదిరి : పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు తరలివచ్చి రక్తదానం చేయాలని కోరారు.

ఇంటింటి నైపుణ్య సర్వేపై నేడు శిక్షణ

ముదిగుబ్బ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం సచివాలయం సిబ్బందికి ఇంటింటి నైపుణ్య సర్వేపై శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంపిడిఒ విజయ భాస్కర్ తెలిపారు. సర్వేలో భాగంగా ప్రతి ఉద్యోగి రోజుకు 25 ఇళ్లు సర్వే చేసి నిర్ణీత యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది తప్పక హాజరు కావాలని ఎంపిడిఒ తెలిపారు

అంగన్వాడీ ఆయా హఠాన్మరణం

ప్రజాశక్తి-ముదిగుబ్బ



రామకృష్ణమ్మ(ఫైల్‌ఫొటో)

మండలంలోని ముక్తాపురం పంచాయతీలోని నల్లచెర్లోపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్న రామకృష్ణమ్మ (56) సోమవారం మృతిచెందింది. ఆమె సోమవారం అంగన్వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తూ హఠాత్తుగా కుప్పకూలి పడిపోయింది. స్థానికులు సమాచారం ఇవ్వడంతో 108 వాహనం అక్కడికి చేరుకుంది. 108 సిబ్బంది పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలికి భర్త, ఒక కుమార్తె ఉన్నారు. అంగన్వాడీ ఆయా మృతిపట్ల బత్తలపల్లి సిడిపిఒ సరస్వతి, సూపర్వైజర్ లలితమ్మ, ప్రాజెక్టు అధ్యక్షురాలు రజియా సంతాపం ప్రకటించారు.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-బుక్కపట్నం



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం జగదీష్ తెలిపారు. ఈ నెల 26వ తేదీ అనంతపురంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి 89 కిలోల వెయిట్ లిఫ్టింగ్ విభాగం పోటీల్లో పదో తరగతి విద్యార్థి గణేష్‌రెడ్డి, 81 కిలోల విభాగంలో ముక్తియార్, అండర్-19 పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 68 కిలోల విభాగంలో పదో తరగతి విద్యార్థి మంజునాథ్, 50 కిలోల విభాగంలో మోహన్‌కృష్ణ జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. వీరు నవంబర్ 2వ తేదీ తెనాలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటా రని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పిడి నాగరాజు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

నూతన ఎంపిడిఒకు ఎపిటిఎఫ్ నాయకుల శుభాకాంక్షలు

సోమందేపల్లి : నూతన ఎంపిడిఒ మమతాదేవిని సోమవారం ఎంఇఒ ఆంజనేయులునాయక్ ఆధ్వర్యంలో ఎపి టిఎఫ్ నాయకులు కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు చంద్ర, ప్రధాన కార్యదర్శి సంజీవరాయుడు, సీనియర్ నాయకులు జవ్వాజి నాగరాజు, రంగేష్‌కుమార్, అశ్వర్థప్ప, రంగేనాయక్, అంజి, సౌజన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.